# నిరీక్షణ:—

"చంద్రశ్రీ."

ఆమె ముఖంలో సౌందర్య కాంతులు అస్పష్టంగా గోచరిస్తున్నాయి. చింతానిమగ్న హృదయ కనుక అలా వుంది కాని-...లేకపోతే ఆమె కూడా సౌందర్యఖని అని ఒప్పుకోవచ్చు—ఆ లేత వయసులో ఏచింత వుంటుంది?...సంసార చింత అప్పుడే అంటదు. ఆర్థిక చింత అసలే సున్న. పొంగేవయసు-వూహాలు రేగే హృదయం- ప్రియుని ఎడబాటు వలన కలిగిన చింత-...అనగా ఇంచుమించుగా 'ప్రోషిత ప్రియ' అన్నమాట...ఆమెను చూడగానే సాహిత్య విదులికు-;

"అంతర్హితే శశిని సైవ కుముద్వతీ మే
దృష్టిం ననందయతి సంస్మరణీయశోభా
ఇష్ట ప్రవాస జనితాన్య బలాజనస్య
దుఃఖాని నూనమతి మాత్ర సుదుఃసహాని."

అన్న కాళిదాసుగారి శ్లోకం జ్ఞప్తికి రాక మానదు...

* * *

'ఇవాళ శుక్రవారమేనా?...రమ్మని రాశా... ఉత్తరం అందిందో లేదో? ...అందితే రాకుండా మానాడా?...అందినా రావటానికి వీలున్నదో లేదో?...ఒక వేళ కాలేజీకి శెలవు దొరికిందో లేదో?...అథవా శెలవు దొరకకపోతే- ఫైన్ అయినా చెల్లిస్తాడు కాని- ప్రయాణం మానాడా?...అసలు బయలుదేరి వస్తున్నాడేమో!...ఏమాత్రం వీలున్నా రాక మానడు... ఒక వేళ వూళ్ళో వుంటారని శంకించి రావటం మానుకుంటాడేమో!...ఆయనగారు క్రిస్టమస్‌కు మద్రాస్ వెడతారని రాశాగా!...'

'అతను కాలేజీకి వెళ్ళబోయే ముందు; ఆయనగారికి ఈ సంగతి తెలిసి- పెట్టిన చీవాట్లకు రావటానికి మనస్సు ఒప్పలేదేమో!...పాపం! ఎందుకో అతన్ని ఊరికే అన్ని చీవాట్లు పెట్టడం!...గురివిందగింజ తన నలుపు ఎరగదట?...తామెన్ని పనులు చేసినా ఎలా తిరిగినా తప్పు లేదట...అలాగే అంతా చేయకూడదట:...తాము మగవారుట!...అయితే యేం?...ఇష్టమొచ్చిన వారితో తమ కోరికలను నెరవేర్చుకోవచ్చు...ఆడది అలా చెయ్యకూడదట. ఆడ; మగ; భేదం- కాని అందరిదీ మానవజాతేగా!...నేను అతన్ని మనస్ఫూర్తిగా ప్రేమించటం పాపంట!...ఏమిటి ఈ ధర్మం?...ఎవరు నియమించారు ఈ ధర్మాలను!...ఎవరో నిర్మించిన ధర్మాలకు నేను బద్ధురాలను కావాలిట!...నాకేం ఖర్మం? నా ధర్మాన్ని నేను నియమించుకో లేనూ?...ఎవరి జీవిత ధర్మం- తమంత తాము- ఎవరు నిర్మించు కోలేరో- ఎవరు అంత చేతకాని-మానవమ్మన్య మాన్యులో వారు ఆ బూజుపట్టిన ధర్మాలను నిర్వర్తించాలి...?

... ... ...

'ఆయనగారు అన్నమాటలతో అతనికి పనేముందీ?...ఆయనగారు అన్న మాటలన్నీ మరచిపొమ్మని బ్రతిమాలా...వచ్చేది ఆయనగారికోసం కాదుగా!... నాకోసం...పవిత్రమై- నిష్కల్మషమైన నా ప్రేమకోసం... నిజంగా ప్రేమ స్వరూపుడు... ప్రేమతత్వం అతనికి తెలిసినంత బాగా అందరికీ తెలియదు... తెల్లవారు ఝామున మెయిల్‌కు వెడతాడనగా—క్రిందటి సాయంకాలం ఆయనగారు బజారుకు

వెడితే; గదిలోకివచ్చి; సోఫాలో నా ప్రక్కనే కూర్చుని; ఆయ నన్నమాటలకు నాకు కించిత్తయినా కష్టంలేదు. ఎవ రెన్నివిధాల అనుకున్నా ఎన్నికష్టాలు వచ్చినా నిన్నుమాత్రం విడవను. ఎవరో అనుకుంటే వదలెయ్యటానికి-ఎవరి కోసమైన ప్రేమించానా?... నాకోసం నేను బ్రతుకుతున్నాకాని ఎవరికోసమో కాదు-ఆ సంగతి గ్రహిస్తే లోకం-కాస్త వెలుతురులోకి వస్తుంది...ఇహ నాకు శెలవియ్యవూ?...అని కళ్లనీళ్లతో గద్గదస్వరంతో ముంజెయ్యి ముద్దెట్టుకుని వెళ్లలేక వెళ్లలేక వెడుతూంటే నాకెంతో ఇదిగావుంది. అతను నన్నెంతో ప్రేమించాడు ఒకసారి—నిజంగా ఇప్పటికి జ్ఞాపకమొస్తుంది-ఎదురుగా కూర్చుని అతని బాహు పంజరంలో నన్ను ఇముడ్చుకుని, "నా అంధకార జీవితానికి నీవే జ్యోతిస్వరూపిణివి. నీ ప్రేమ సుధాకాంతుల నా మీద ప్రసరింపజేసి-నా జీవితాన్నంతా ప్రకాశవంతంగా చెయ్యి. నీ ప్రేమదాసుణ్ణి" అని ఎన్నోవిధాల ఇదయాడు. ఎలా మరచిపోగలను?. ఎన్ని విధాలైనా ఆనందడోలికల్లో ఊగులాడించాడు. ఎంత రసికుడు...పాపం! నన్ను ప్రేమించి పడరాని మాటలన్నీ పడ్డాడు. అయనగారు అన్న మాటలన్నీ తలపుకు వొస్తే—విరక్తికూడా పుడుతుందేమో!... అయినా అతనిది అంత స్వల్పహృదయం కాదు. ఇంతకీ నా అదృష్టం ఎలావుందో?...'

* * *

'నాలుగున్నరకుగాని రైలురాదు. ఇప్పుడు టైము ఎంతయింది?...రెండుంబావు...ఛీ! వెధవ గడియారం?...ఇంత 'స్లో'గా నడుస్తున్నదేం?... ముల్లు వొక్కసారి నాలుగున్నర మీదికి తిప్పితే ఇప్పుడే వస్తాడుగా?...నాలుగున్నర...ఇంకా పది నిమిషాలయింది. వస్తున్నాడేమో!... ప్చ్! రావటంలా...ఇంట్లోవున్న గడియారం కనుక ఆదుర్దావలన త్రిప్పా-కాని'టౌను'లో వున్న గడియారాలు రైల్వేవాళ్ల గడియారాలు-ఎవరు త్రిప్పుతారు?...'

* * *

మొన్న 'మెయిల్' మూడుగంటలు ఆలస్యంగా వచ్చింది-అలాగా ఇవాళ ఈరైలు పెందరాళే-కొంచెం 'ఎర్లీ'గా రాకూడదూ?...'ఎర్లీ'గా నడప కూడదని రైల్వేవారి రూల్ కాబోలు!...'లేట్'గా నడవవచ్చునేం?...ఛీ! ఈరైల్వే డిపార్టుమెంట్ వారికి రైళ్లు ఎలా నడపాలో ఏఏరూల్సులు అవసరమో కూడా తెలుసూ?...అవసరాన్నిబట్టి ఇలాంటి సందర్భాల్లో-'ఎర్లీ'గా నడపాల్సివస్తుందని గ్రహించక్కర్లా?..'

... ... ...

'ఇంకో గంట వుంది టైము. ఇన్నాళ్లకు వస్తున్నాడు- ప్రెజంట్ ఏమైనా తీసుకొస్తాడేమో!... "నాకోసం 'ప్రెజంట్' ఏమీ తీసుకురావద్దనీ; నీ ప్రేమ నా కర్పించటం- నువ్వు నాకు లభించటం- అదే గొప్ప విలువగల 'ప్రెజంట్'" అనీ అనేక సార్లు చెప్పా...అనవసరంగా డబ్బు తగలెయ్యటం కాని; ఎందుకూ ఊరికే 'ప్రెజంట్'?...ఏదైనా ప్రెజంట్ చేస్తేనే గాని ప్రేమ వున్నట్లు తెలియదా?...ఒఠ్ఠి పిచ్చివాడు! ఏదో వొకటి తీసుకురాకుండా వుండ బుద్ధి పుట్టదుట! అదొహ సరదాట!...ఊరికే రిక్తహస్తాలతో- రావటానికి మనసొప్పక తాత్కాలికంగా-కాస్త మంచిది చూసి తీసుకు రావటమే కాని నాకు సరియైన విలువగల బహుమానం చేద్దాం అంటే- ఈ లోకంలోనే లేదు- అంత విలువగల బహుమతి అంటాడు...ఎంత ఉన్నతమైన అభిప్రాయాలు గలవాడు!...తప్పకుండా రావచ్చునని-మనస్సు ధైర్యంగా వుంది. ఈ నాలుగు గంటలబండికి వస్తాడో!... రాడో!...'...

... ... ...

'నాకు నిజంగా మతిపోతోంది. వస్తాడు వస్తాడని ఉవ్విళ్ళూరటమే కాని--వచ్చేటప్పటికి కాస్తతలైనా దువ్వుకుందామన్న జ్ఞానం పోయింది. అతనికి వాల్జడ అంటే ఎక్కువ ఇష్టం ఆయనగారు వాల్జడ వేసుకో నిచ్చేవారుకాదు. వాల్జడ వేసుకుంటే-రకం వారీ అంటారుట. వాల్జడ వేసుకున్నంత మాత్రాన అంతా భర్తలను విడిచిపెట్టి వెళ్లిపోయేవారేనా?... జడ కనుక వేసుకోవద్దని నిర్బంధిస్తారు...మనస్సును ఏం చేస్తారు?'

'చీర-ఏ చీరకట్టుకోనూ?...బీరువానిండా ఇన్ని చీరలున్నాయన్న మాటేకాని, ఒక్కటీ సరియైనది లేదు...అన్నట్టు మరచి పోయాను- ఇదివరలో అతను 'ప్రెజంట్' చేసిన బెంగుళూరు సిల్కుచీర వున్నది కాదూ!...మూడో బీరువాలో ఉన్న దనుకుంటా...ఈ చీర అంటే అతనికి చాలా ప్రీతి...ఇదే కట్టుకుంటా... చీర బాగానేవుంది...ఏ కట్టు కట్టుకోనూ?...పార్శీ కట్టు అంటే అభిలాషజాస్తి అతనికి; ఈచీర ఇప్పుడిలా కట్టుకుంటే; రాత్రికి-బాటరీ అంచు తెల్లచీర రాత్రికి గూడకట్టు కట్టుకోవచ్చు. ఏచీర ఎలా కట్టుకోవాలో- అలా కట్టుకోపోతే రోటికి చుట్టినట్లు వుంటుంది... కొంతమంది సిల్కుచీరలు-మడి కచ్చాకూడా పోసి కట్టుకుంటారు అసహ్యంగా...'

'అతను వచ్చేసరికి వాకిట్లో వాసవసజ్జికలా కూర్చుందమా అంటే- పనీ పాటలులేక ఆడది కనపడగానే- లొట్టలు వేసుకునే వారంతా వీధి వెంబడి పోతూ;- "పాపం! ఎవరికోసమో గుమ్మంలో కూర్చుంది. ఎప్పుడు వస్తాడో!...ఆ వచ్చేవాడు ఎలాంటివాడో!..." అంటూ పోతూ వుంటారు. ఇంతేగా ప్రయోజకత్వం... 'ఎటికెట్' తెలిస్తేగా! చదువు కోగానే సరా!...వీధివెంబడి ఎలా నడవాలో తెలియదు చాలా మందికి...పోనీ- ఏదైనా పుస్తకం చదువుకుంటూ కూర్చుందా మన్నా; ఏదైనా రుమాల అల్లుదామన్నా- ఏం తోచదు సాగదు-ఏపనీ కూడా... ఏమయినా- అతను వచ్చేసరికి- సోఫాలో కూర్చుని; అతని రుమాలమీద పేరు అల్లుతూ వుంటా- ఎలాగైనా- అబ్బ!...ఇంకా అరగంట- గడపాలి...'

... ... ...

"'షోఫర్'ను పిలిచి కారుతో కూడా పంపా స్టేషన్‌కు...ఇక్కడకు వచ్చింతర్వాత మళ్లీ టీ తాగి వస్తానని బయలు దేరుతాడేమో!...అతని మామూలు హోటలుకు అలా వెడితేగాని- మరో చోట టీ తాగడు, పోనీ 'ప్యూన్'ను పంపి- ఫ్లాస్కునిండా- ఆ...హోటల్ నుంచే తెప్పిస్తా టీ...ఇహ కావలసినవి సిగరెట్లు. ఇక్కడ చిక్కు...నిమిషానికి పది రకాలు దిగుతాయి. వెనక 'సిజర్స్' కాలుస్తూ వుండేవాడు- మరి ఇప్పుడు ఏం కాలుస్తున్నాడో...ప్రస్తుతం ఈనాటికి సిజర్స్- ఓ రెండుపెట్టెలు తెప్పిస్తే-రేపు అతనికి కావాల్సినవి నౌకరుచేత తెప్పించవచ్చు...రాగానే కావాల్సిన ముఖ్యవస్తువులు ఈ రెండేగా!...ఇహ గుమ్మం కదలవలసిన అగత్యం లేదు...ఇక్కడకు వచ్చి ఇంకా గుమ్మం కదలటమేనా?...'

'వస్తాడు... వచ్చి?... సోఫాలో—నాప్రక్కనే కూర్చుంటాడు ... కూర్చుని?...ఈ రుమాల చూస్తాడు. చూసి-తీసుకుంటాడు. తీసుని-?...దీనికి-బహుమానం ఇవ్వనా?...అని భుజంమీద చెయ్యివేసి...అబ్బ!... ఆమాట తలచుకుంటే-వళ్లు...

'వచ్చి—నాకు చదువుకోటానికి పుస్తకాలు ఏమన్నావుంటే ఇయ్యమంటాడేమో!... అక్కడవున్నన్నాళ్ళూ ఎలాగో పత్పదు చదువు...ఇక్కడకు వచ్చింతర్వాతకూడా ఇంకా చదవనిస్తానూ?...బీరువాతాళం వేసి-తాళాలు దాచేశి-అయనగారుకూడా తీసికెళ్లారు. తాళాలు-లేవని చెబుతా...అంతే!...అవకాశంవుంటే ఇరవై నాలుగు గంటలూ చదువుతా నంటాడు. కాని-

ఆ చదువు సాగుతుందా?...సాగితే బుర్ర కెక్కుతుందా?...ఎటుపోయి ఎటొచ్చినా-ఈ గీతగోవిందం వక్కటీ-పైన పెడతా-కావాలంటే ఇది ఒక్కటే-యిస్తా-ఇస్తే చక్కగా పాడుతాడు. కిన్నెర కంఠం గంధర్వులు పాదాక్రాంతులు కావాల్సిందే గొంతెత్తితే చాలు...అంతనికంటె సంగీతంలో పండితులు ఉండవచ్చు—కాని పాటలో హాయి-వుండద్దూ?.. వెనక ఎప్పుడో ఒకసారి పాడాడు. ఇప్పటికీ ఇంకా వినబడుతూనే వుంది ఆపాట!...

"చరణ రణిత మణినూపురయా-
పరిపూరిత సురతవితానం
ముఖర విశృంఖల మేఖలయా-
సకచగ్రహా-చుంబన దానం-
సఖి! హేకేళి మథనముదారం-
రమయమయా సహ మదన మనోరథ
భావిత యాసవికారం "——"

ఎంత ఆహ్లాదకరంగా పాడాడు-వస్తున్నాడేమో?....?...?...'

* * *

ఇంకా అయిదు నిమిషాలు వుంది టైం. ఆమె ఆనందవీచికల్లో-తేలి యాడుతుందా?...లేక?...?...


# అజ్ఞాతపాండవము

దొరతనమువారిచే పఠనీయగ్రంథముగా అంగీకరించబడినది ప్రతి 1-కి రు 0-10-0

# సహాదేవ పశుచికిత్స

(తాత్పర్యసహితము)

పశువులకు గలుగుసకలవ్యాధులకు చికిత్సలు తేటతెల్లముగా తెలుపబడినవి. ప్రతి 1-కి రు 0-2-0

# ఐరోపాఖండ యుద్ధచరిత్రము

భూగోళచిత్ర భావపట సహితము

1—వ భాగం 0—8—0
2—వ భాగం 0—12—0

# సోదరప్రేమ లేక మాధవరావు

నీతిదాయకమగు నవల.

దొరతనమువారిచే పాఠశాలలకు అంగీకరింపబడినది.
ప్రతి 1-కి 0—10—0

ఆనందబోధిని ఆఫీస్,
సౌకారుపేట, మదరాసు.



కామశాస్త్రములు—అంతఃపురకాంతలు.

కామశాస్త్రములను పూర్వము అంతఃపురకాంతలు కూడ పఠించేవారు. అటువంటిఅపసర గ్రంథములు నేడు అందరును చదువుటకు అవకాశ మేర్పడినది. సచిత్రములతో సులభశైలిని వ్రాయబడిన రసవత్తర శాస్త్ర గ్రంథములు.

సతీపతి కుతూహల రహస్యములు
వెల రు .2-0-0

దాంపత్య రహస్యములు వెల రు. 1-0-0

మన్మథ సామ్రాజ్యము వెల రు. 0-8-0

పడకటింటి రహస్యములు వెల రు. 0-8-0

స్త్రీ పురుష ప్రేమ రహస్యములు వెల రు. 1-0-0

పడకటింటి ముచ్చటలు వెల రు. 0-8-0

శరీరమర్మశాస్త్రము వెల రు. 1-0-0

(పోస్టు ఖర్చులు ప్రత్యేకము)

ఆర్యన్ బుక్ డిపో,
ట్రిప్లికేన్, : మదరాసు.